క్లుప్తంగా

14న డిపార్ట్‌మెంట్ పరీక్షల బిట్స్ బుక్‌లెట్ విడుదల

కడప ఎడ్యుకేషన్: కడపలోని ఎన్‌జీఓ భవన్‌లో ఈ నెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు డిపార్టుమెంట్ పరీక్షల బిట్స్ బుక్‌లెట్లను విడుదల చేస్తున్నట్లు ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు సివి ప్రసాద్, చెంగల్‌రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఈశ్వరచంద్ర, అలీఖాన్, చంద్రశేఖర్‌రెడ్డిలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేసీసీ చైర్మెన్ శ్రీనివాసులు హాజరవుతున్నట్లు తెలిపారు. 300 పేజీలు గల బిట్స్ బుక్‌లెట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. దీంతోపాటు మోడల్ పేపర్లు, ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ పరీక్ష రాసే విధానంపై కరదీపిక కూడా పంపిణీ చేస్తామని చెప్పారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

కడప రూరల్/ కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని క్యూర్ ఆసుపత్రిలో ఈ నెల 14వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కీళ్ల, ఎముకల వైద్య నిపుణులు కే పార్థసారథి తెలిపారు. శుక్రవారం స్థానిక ఆ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో కీళ్లు, ఎముకలు, నరాలు, వెన్నుముక తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అలాగే జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వై చంద్రమౌళి బీపీ, షుగర్, జ్వరాలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఉచిత వైద్య శిబిరంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. శిబిరానికి వచ్చే వారు ముందుగా 95531 02102 నెంబరులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కృష్ణమూర్తి

కడప రూరల్: రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కడప నగరానికి చెందిన సీ కృష్ణమూర్తి నియమితులయ్యారు. తన నియామకం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. తాను జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రజక సోదరులకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. తన సేవలను గుర్తించి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించినందుకు సంతోషంగా ఉందన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు పన్నీటి కాశయ్య, జిల్లా అధ్యక్షులు చేలో రవి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

20 నుంచి ప్రభుత్వ హాస్టళ్ల సందర్శన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈనెల 20 నుంచి 30 వరకు ప్రభుత్వ హాస్టళ్లను సందర్శించి సమస్యలు తెలుసుకుంటామని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ హాస్టళ్లలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నగర కార్యదర్శి శివశంకర్, నగర ఉపాధ్యక్షుడు అకిరా నందన్, చంద్ర, మస్తాన్, అశోక్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జూట్ బ్యాగ్‌లు వాడాలి

వైవీయూ: పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ బ్యాగ్‌ల స్థానంలో జూట్‌బ్యాగ్‌ల వినియోగాన్ని ప్రోత్సహించాలని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా సూచించారు. శుక్రవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ పేపర్ బ్యాగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్యాన్ని తగ్గించేందుకు అందరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి వాటిస్థానంలో జూట్ బ్యాగులు, పేపర్ బ్యాగులు, బట్ట సంచులను వినియోగించాలన్నారు. అనంతరం జూట్ బ్యాగుల తయారీ వ్యవస్థాపకులు భవానీ జూట్ బ్యాగుల తయారీ గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గురివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఎంపీ సీఎం రమేష్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపతోపాటు తనను లోక్‌సభకు పంపిన అనకాపల్లి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీజేపీ లోక్‌సభ సభ్యుడు సీఎం రమేష్ తెలిపారు. ఎన్నికలలో గెలిచి తొలిసారిగా శుక్రవారం కడపకు వచ్చిన సందరర్భంగా కూటమి నేతలతోపాటు అభిమానులు, ఆయా పార్టీల కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. ఆయన తొలుత దేవుని కడపలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం పెద్దదర్గాలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సీఎం రమేష్‌నాయుడు మీడియాతో మాట్లాడుతూ కడప స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు హరిప్రసాద్, ముక్తియార్, గోవర్ధన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ మార్క్



వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అమ్మ ఒడి అమలు చేశారు. వైఎస్ జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాల అనే తేడా లేకుండా విద్యార్థులకు అమ్మఒడి పథకాన్ని పటిష్టంగా అమలు చేశారు. ఎలాంటి కొర్రీలు .. నిబంధనలు లేవు. పక్కాగా అమ్మఒడి అమలైంది. ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు చొప్పన తల్లుల ఖాతాలకు ఏటా తప్పకుండా చెప్పిన సమయానికి జమ చేశారు.

బాబు రిమార్క్



'అమ్మఒడి' స్థానంలో 'తల్లికి వందనం' పేరుతో ఇంటిలో ఎంతమంది విద్యార్థులుంటే అందరికీ ఏటా రూ.15 వేలు ఇస్తాం' అని ఎన్నికల వేళ ప్రతి సభ.. సమావేశంలో చంద్రబాబు చెప్పిన మాటలివి. అయితే అధికారంలోకి వచ్చాక ఆయన మాటల గారడీ బయటపడింది. ఇప్పుడు మాట మార్చారు.. హామీ పక్కనబెట్టారు. నయవంచనకు దిగారు. ఒక్కరికే వందనం అంటూ జీఓ జారీ చేశారు. ఈ విషయం తెలిసి.. తల్లిదండ్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.. అమలు చేయనప్పుడు హామీ ఎందుకిచ్చారంటూ ప్రశ్నిస్తున్నారు.

బాబు సూపర్ 6

స్కూలుకు వెళ్ళే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 15,000

తల్లికి వందనం పిల్లలకు బంధనం

- ఎంత మంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం అన్నారు
- మేనిఫెస్టోలో చేర్చి ఊదరగొట్టారు
- అధికారంలోకి వచ్చాక ఒక్కరికే అంటున్నారు
- ఇదేం పద్ధతి బాబూ .. అంటూ తల్లిదండ్రుల మండిపాటు



మాట తప్పితే ఎలా బాబూ..

నా పేరు బి.పార్వతి. మేము కడప నగరంలోని అరవిందనగర్‌లో ఉంటున్నాము. నా భర్త ఒక ఆటో డ్రైవర్. నాకు ఇద్దరు కుమారులు. కడప నగరంలోని ప్రైవేటు పాఠశాలలో ఒక బాబు ఐదవ తరగతి, ఇంకో బాబు మూడవ తరగతి చదువుతున్నారు. గత ప్రభుత్వం అమ్మ ఒడి పథకం నిధులు క్రమం తప్పకుండా జమ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంత మందికి రూ. 15 వేలు ఇస్తామని.. తల్లికి వందనం పథకం పేరుతో అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. కానీ ఇంతవరకు ఈ పథకాన్ని అమలు చేయలేదు. ఇప్పుడు ఒక్కరికే తల్లికి వందనం అంటున్నారు. ఇది ఎంత మాత్రం సమంజసం.

కడప ఎడ్యుకేషన్ / కడప కోటిరెడ్డి సర్కిల్ / కడప అర్బన్: పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం అమ్మ ఒడి పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసింది. పాఠశాలలు ప్రారంభమైన వారం పది రోజుల్లో పిల్లలను బడికి పంపే ప్రతి తల్లిఖాతాకు ఇచ్చిన హామీ మేరకు రూ.15 వేలు నగదు జమ చేసింది. ఈ నిధులతో తల్లిదండ్రులు తమ పిల్లలకు అవసరమైన విద్యాసామాగ్రిని కొనుగోలు చేసుకుని పిల్లలను సంతోషంగా బడికి పంపేవారు.

- 2024 ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో టీడీపీ ఇంట్లో ఎంతమంది పిల్లలు బడికి పోతే అంత మందికి ఒక్కొక్కరికి రూ. 15 వేలు చొప్పున అందిస్తామని ప్రకటించింది. తీరా అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ పక్కన పెట్టారు. ఒక్కరికే అంటూ తల్లికి వందనం అంటూ మాటమార్చారు. విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు నెల రోజులు అవుతున్నా ఇంకా హామీ అమలు చేయకపోగా.. పూర్తి స్థాయి విధి విధానాలను త్వరలో విడుదల చేస్తామని ప్రకటించారు.

కడప మండలంలో ..

గత ప్రభుత్వం 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అమ్మ ఒడి పథకాన్ని ఏటా అమలు చేసింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ముందుగానే క్యాలెండర్‌ను ప్రకటించి తల్లుల ఖాతాలకు నగదును జమచేశారు.

దీంతో కడప మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రై వేటు పాఠశాలలకు సంబంధించి 37476 మంది తల్లులకు నగదును జమచేశారు. అయితే చంద్రబాబు ఇచ్చిన హామీపై ఆశలు పెంచుకున్న తల్లిదండ్రులకు ఇప్పుడు చుక్కెదురైంది.

చెప్పిన ప్రకారం అమలు చేయాలి



ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు ఎంత మంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం అని చెప్పారు. దీంతో చాలా మంది తల్లితండ్రులు సంతోషంచారు. ప్రస్తుతం ఇచ్చిన జీఓలో మాత్రం ఈచ్ మదర్‌కు రూ. 15 వేలు అని ఉంది. దీని ప్రకారం ఒక్కో తల్లికి రూ. 15 వేలనే కదా అర్థం. అలా కాకుండా ఈచ్ స్టూడెంట్‌కు రూ. 15 వేలని ఇస్తే క్లారిటీ ఉంటుంది.

- నాగమునిరెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ ఈఓ

అమ్మ ఒడికి సంబంధించి కడప నియోజకవర్గంలో కులాల వారిగా నాలుగేళ్లలో బెనిఫిషర్స్ వివరాలు

కేటగిరి	బెనిఫిషర్స్
బీసీ	19516
ఓసీ	5628
ఎస్టీ	994
మైనార్టీ	1689
ఓసీ కాపు	2231
ఓసీ నాన్ కాపు	7418



బాబూ.. మాట మార్చొద్దు



టీడీపీ మేనిఫెస్టోలో 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న ప్రతి ఒక్క విద్యార్థికీ 'తల్లికి వందనం'పథకం వర్తింపచేస్తామనీ హామీ ఇచ్చింది. ఇప్పుడేమో ఇంట్లో ఒక్కరికే ఈ పథకం వర్తింపజేస్తామనీ చెప్పడం విడ్డూరంగా ఉంది. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా తల్లికి వందనం పథకం ఆప్కాస్‌లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలందరికీ వర్తింపచేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఆప్కాస్‌లో దాదాపు లక్ష 10 వేల మందికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సంక్షేమ పథకాలు అందడంలేదు.

- పి. వెంకట సుబ్బయ్య, ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

చదువుపై ప్రభావం చూపుతుంది....



నా పేరు ఎస్. భాగ్యలక్ష్మి. మాది కడప సమీపంలోని ఊటుకూరు గ్రామం. నాకు ఇద్దరు పిల్లలు. వీరిలో ఒకరు కడప నగరంలోని ఓ ప్రైవేటు స్కూల్లో 7వ తరగతి చదువుతున్నాడు. మరొకరు మా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. తల్లికి వందనం కింద మా పిల్లలిద్దరికి కలిసి రూ. 30 వేలు వస్తుందనుకున్నాను. ఈ డబ్బులతో పిల్లోడి ఫీజు చెల్లిద్దామనుకున్నా. కానీ బయటేమో ఒక్కరికే అమ్మ ఒడి అంటున్నారు. ప్రభుత్వం చెప్పిన ప్రకారం తల్లికి ఎంతమంది పిల్లలుంటే అందరికి తల్లికి వందనం ఇవ్వాలి.

ఆశపడి భంగపడ్డాం



నాపేరు సుధారాణి. మాది కడప. నాకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చేరాడు. కుమార్తె ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తల్లికి వందనం పథకం పేరుతో కుటుంబంలో ఎంతమంది ఉంటే అందరికీ రూ. 15 వేలు వంతున నగదును బ్యాంకుకు జమ చేస్తారంటే ఆశపడ్డాం. ఇప్పుడు ఒక్కరికే పథకం వర్తింపజేస్తారనే జీఓ వచ్చినట్లుగా తెలుస్తోంది. ఆశపడి భంగపడ్డాం.

ఇచ్చిన మాట నెరవేర్చాలి



నాకు ముగ్గురు బిడ్డలు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ రూ. 15 వేలు వంతున ఆర్థికసాయం అందిస్తామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. దీని ప్రకారం నాకు రూ. 45 వేల ఆర్థికసాయం అందాలి. ఇచ్చిన మాట నెరవేరుస్తే బాగుంటుంది.

- వి.మంజుల, కడప

రూ. 30 వేలు వస్తుందని ఆశపడ్డా



చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను అమలు చేయాలి. తల్లికి వందనం పథకం పక్కాగా అమలు చేస్తే మాకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నాకు ఇద్దరు అమ్మాయిలు. వారు ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్నారు. ఇద్దరు పిల్లలకు రూ. 30 వేలు వస్తుందని ఆశ పడుతున్నాను. అయితే ఒక్కరికే పథకం వర్తిస్తుందనే ప్రచారం జరుగుతోంది. దీనివల్ల కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చదనే అనుమానం కలుగుతుంది.

- ఎల్.పద్మశ్రీ, కడప

మాటకు కట్టుబడి ఉండాలి



నాకు ఇద్దరు ఆడ పిల్లలు. వారిని ప్రభుత్వ పాఠశాలకు పంపుతున్నాను. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం డబ్బులు ఇవ్వాలి. అప్పుడే మాలాంటి పేదలకు కొంతమేర చదువులకు, మరికొంత ఇతర ఖర్చులకు ఉపయోగపడుతుంది. మాటకు కట్టుబడి ఉండాలి. - ఏసమ్మ, కడప

వినూత్న ఆలోచనలు రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆత్మ పీడీ విజయలక్ష్మి

కడప అగ్రికల్చర్: వ్యవసాయంలో విద్యార్థులకు వినూత్న ఆలోచనలను పెంపొందించడానికి పాఠశాల స్థాయి నుంచే కేవీకే, జిల్లా వ్యవసాయ సాంకేతిక యాజమాన్యం(ఆత్మ) కృషి చేస్తోందని కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, ఆత్మ పీడీ విజయలక్ష్మి పేర్కొన్నారు. అటల్ వినూత్న మిషన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కడపలోని నాగార్జున స్కూల్ విద్యార్థులు, పొద్దుటూరు గోపీకృష్ణ హైస్కూల్ విద్యార్థులకు కేవీకేలో విజ్ఞానయాత్రను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుద్దేశించి వారు మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే కేవీకే రైతులకు అందిస్తున్న సేవలు, సాంకేతిక పరిజ్ఞాన వ్యాప్తికి అవలంబిస్తున్న విస్తరణ పద్ధతుల గురించి తెలియ చేశారు. అనంతరం సామాజిక విజ్ఞాన శాస్త్రవేత్త ప్రశాంతి వ్యవసాయ పంటకు చేస్తున్న వివిధ విలువ జోడింపులు, యంత్ర పరికరాల గురించి వివరించారు. సేద్య విభాగ శాస్త్రవేత్త సాయి మహేశ్వరి వివిధ రకాల వ్యవసాయ పంటలు గురించి అలాగే కేవీకే క్షేత్రంలో పనిముట్ల గురించి వివరించారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ పంటల్లో చీడపీడలు, తెగుళ్ల గురించి తెలియచేశారు. అనంతరం చార్ట్స్, పోస్టర్స్‌ను చూపించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ను ధరించి ప్రమాదాలను నివారించండి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ట్రైనీ న్యాయమూర్తులు, పోలీసు, న్యాయశాఖ సిబ్బంది

కడప అర్బన్: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ట్రైనీ న్యాయమూర్తులు ఎం. చంద్రశేఖర్‌రెడ్డి, కంది సురేంద్రారెడ్డిలు శుక్రవారం కడప రిమ్స్ పీఎస్ పరిధిలో హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు, పిలియన్ డ్రైవర్ల వినియోగదారులు హెల్మెట్ ఉపయోగించడం బాధ్యతగా భావించాలన్నారు. హెల్మెట్ ధరించడం చాలా సురక్షితమని అవగాహన కల్పించారు. ఈ ర్యాలీలో రిమ్స్ పీఎస్ సీఐ కె. రామచంద్ర, ఎస్ఐ నారాయణ, ఏఎస్ఐ యోగా రాయల్, కోర్టు కానిస్టేబుల్ రామయ్య, ఇతర కానిస్టేబుళ్లు, పారా లీగల్ వాలంటీర్‌లు, కోర్టు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

శాకాంబరి అలంకారం



కడప కల్చరల్ : కడప నగరం హనుమప్పవీధిలోని గ్రామదేవత శ్రీ నడివీధి గంగమ్మ తల్లిని శాకాంబరిగా అలంకరించారు. శుక్రవారం అమ్మవారికి అత్యంత ప్రియమైన రోజుగా భావించి ఈ మాసపు ప్రత్యేకతను సంతరింపజేస్తూ ఆషాడ అలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి 21 రకాల ఆకుకూరలు, కూరగాయలతో కనులపండువగా అలంకారం చేశారు. అలంకార నిపుణులు ఓపికగా తెల్లవారుజాము నుంచి కూరగాయలను అలంకరించారు. అనంతరం స్థానిక భక్తులు కూడా అమ్మవారికి కూరగాయలు, ఆకుకూరలు సమర్పించి పూజలు నిర్వహించారు.

మొక్కల పెంపకం ప్రాధాన్యత గుర్తించాలి



మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రస్తుత పరిస్థితుల్లో చెట్ల పెంపకం ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డి తెలిపారు. కడప నగరంలోని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థలో పీఓఎఫ్ మాస్టర్ ట్రైనర్లకు ఐదు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎఫ్‌ఓ మాట్లాడుతూ చెట్లు మానవ జీవితానికి కలిగించే ఉపయోగాన్ని వివరించారు. నాబార్డు ఏజీఎం విజయ్ విహారి మాట్లాడుతూ ఆగ్రో ఫారెస్ట్రీ పద్ధతుల ద్వారా రైతులు పొందగల ఆర్థిక లాభాలు, కార్బన్ క్రెడిట్లను వివరిస్తూ ఇవి రైతులకు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన మాస్టర్‌ట్రైనర్లు తమ గ్రామాలలో రైతులకు ఆగ్రో ఫారెస్ట్రీ పద్ధతుల అమలు, వ్యాప్తి చేయడంలో ప్రధానపాత్ర పోషించాలన్నారు. సెప్టెంబరు చివరి నాటికి ఐదు వేల మంది రైతులను చేరుకోవాలనే లక్ష్యంగా పెట్టుకుని, ఈ పద్ధతులను రైతులు అవలంబించే విధంగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో బృందం స్టేట్ కో ఆర్డినేటర్ చోనా చలం, స్టేట్ అసోసియేట్ సతీష్, కేవీ జయంత్, డి.ప్రవీణ్ తోపాటు జిల్లాలోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు.

మహిళా ఖైదీలు న్యాయ సహాయానికి సంప్రదించాలి



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న ట్రైనీ న్యాయమూర్తులు

కడప అర్బన్: మహిళా ఖైదీలు న్యాయ సహాయం కోసం సంప్రదించాలని ట్రైనీ న్యాయమూర్తులు ఎం. చంద్రశేఖర్‌రెడ్డి, కంది సురేంద్రారెడ్డిలు అన్నారు. శుక్రవారం కడప నగర శివార్లలోని ప్రత్యేక మహిళా కారాగారంలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాన్ ఇండియా ప్రచారం 2024లో భాగంగా జైళ్లలో వున్న బాల నేరస్తులను గుర్తించడం, వారికి తగిన న్యాయసహాయం అందించడం ఈ ప్రచార ముఖ్య ఉద్దేశమన్నారు. ఉచిత న్యాయ సహాయం, రక్షణ సలహా వ్యవస్థ గురించి వివరించారు. పారా లీగల్ వాలంటీర్‌లు, లీగల్ ఎయిడ్ క్లినిక్స్ విధి విధానాలు తెలియజేశారు. అనంతరం మహిళా ఖైదీలకు అందజేసే భోజనం పరిశీలించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికారసంస్థ, కడప వారిని సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణవేణి, డిప్యూటీ జైలర్, మహిళా పారాలీగల్ వాలంటీర్‌లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలివ్వాలి

కడప కార్పొరేషన్: బేడ, బుడగజంగాల కులస్తులకు, వారి పిల్లలకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బేడ, బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు, వైఎస్‌ఆర్‌సీపీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి పస్తం అంజి కోరారు. శుక్రవారం స్థానిక జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం వచ్చినందున కేంద్ర ప్రభుత్వంతో చర్చించి తమకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బుడగజంగాల నాయకులు రాముడు, అంజనేయులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కడప ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తే విద్యాలయాలను ఉద్యమ నిలయాలుగా మారుస్తామని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు యాదవ్ హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని వైయస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయకపోతే ఉద్యమబాట తప్పదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కడప ఉక్కుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు బాబు, గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య నాయకులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే దోమలకు అడ్డుకట్ట



కడప ఫక్కీర్‌పల్లెలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే దోమలకు అడ్డుకట్ట పడుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక ఫక్కీర్‌పల్లెలో నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమంను డీఎంహెచ్‌ఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో వారానికి ఒక సారి ఇంటిలోని తొట్లు, కుండలు, బానలు, కూలర్లను శుభ్రం చేసుకోవాలని అన్నారు. వ్యర్థ పదార్థాలను కాలువల్లో వేయడం వలన దోమలు పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ హైమావతి, ఏఎంఓ వెంకటరెడ్డి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగలక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేరుస్తాం



వినియోగదారురాలుతో స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవిరెడ్డి

కడప అగ్రికల్చర్: ఎన్నికల్లో చెప్పిన ప్రకారం ప్రజలకు ఇచ్చిన హామీలను దశల వారిగా నెరవేరుస్తామని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప రైతు బజార్‌లో పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో మండిమర్చంట్, రైస్ మిల్లుల అసోసియేషన్ వారు బియ్యం, కందిబేడలను సాధారణ ధరకంటే తక్కువ ధరకు వినియోగదారులకు అందించేందుకు ఏర్పాటు చేసిన స్టాల్‌ను కడప ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం రైతు బజార్‌లో కూరగాయల షాపు నిర్వాహకులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పారిశుధ్యం సరిగా లేకపోవడంలో మార్కెటింగ్‌శాఖ సిబ్బందిని మందలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, మార్కెటింగ్‌శాఖ అధికారులు, రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.